అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి

అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సులో చేరిన వారితో సబ్ కలెక్టర్ కిరణ్మయి

అధికారులతో మాట్లాడుతున్న బాన్సువాడ సబ్ కలెక్టర్

బిచ్కుంద, అక్టోబర్ 27: ప్రభుత్వం బిచ్కుందలోని ఐటీఐ కాలేజీలో ప్రవేశపెట్టిన అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సులను యువత సద్వినియోగం చేసుకోవాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. బిచ్కుంద గ్రామ పంచాయతీని డీపీవో శ్రీనివాస్‌తో కలిసి ఆమె ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి పాసైన యువకులతో అక్కడ సమావేశం నిర్వహించారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌లోని ఆరు కొత్త కోర్సులపై అవగాహన కల్పించారు. అనంతరం పలువురు యువకులతో అడ్మిషన్లు చేయించారు. డీఎల్పీవో నాగరాజు, కాలేజీ ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్, ఎంపీవో కృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, హన్మంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి..

నస్రుల్లాబాద్, అక్టోబర్ 27: యువత అన్ని రంగాల్లో రాణించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. బీర్కూర్ మండలంలోని అన్నారం, బీర్కూర్ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఆదివారం ఆమె.. అధికారులతో మాట్లాడారు. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలో ఉన్న ఐటీఐ కాలేజీలో నిర్వహిస్తున్న ఉపాధి,శిక్షణ కేంద్రంలో యువతను చేర్పించాలని అధికారులకు సూచించారు. బీర్కూర్ గ్రామానికి వచ్చిన సబ్ కలెక్టర్‌కు గ్రామంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా డివైడర్లను కొలతల ప్రకారం చేపట్టేలా చూడాలని గ్రామస్తులు వినతిపత్రాన్ని అందజేశారు.

అందుబాటులో అంబులెన్స్ సేవలు

మాట్లాడుతున్న మధుకుమార్

గాంధారి, అక్టోబర్ 27: 108 అంబులెన్స్ వాహనంతోపాటు 102, 1962 వాహనాలు 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటాయని ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ మధుకుమార్ అన్నారు. గాంధారిలో 108 వాహన సిబ్బందితో ఆదివారం సమావేశమైన ఆయన.. వారికి పలు సూచనలు చేశారు. 108, 102, 1962 వాహనాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గాంధారి మండలంలో నాలుగు నెలల్లో 526 అత్యవసర కేసులను వాహనాల్లో తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఎంటీలు సురేశ్, కమలాకర్, పైలట్లు నరేశ్, ప్రకాశ్‌గౌడ్, నవీన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేటి ధర్మయుద్ధ మహాసభ వాయిదా

నాగిరెడ్డిపేట్, నాగిరెడ్డిపేట 27: కామారెడ్డిలో సోమవారం నిర్వహించ తలపెట్టిన మాదిగల ధర్మయుద్ధ మహాసభ వాయిదా పడిందని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కుంటోళ్ల యాదగిరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అత్యవసరంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్తుండడంతో సభను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని మదిగ, మాదిగ ఉప కులాల నాయకులు, కార్యకర్తలు గమనించి సహకరించాలని కోరారు.

లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శిగా వినోద్

రాజంపేట్, అక్టోబర్ 27: లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని నడిమితండాకు చెందిన గుగ్లోత్ వినోద్ నియమితులయ్యారు. ఈ మేరకు సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బెల్లయ్య నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్, జాతీయ ప్రధాన కార్యదర్శి కోట్యా నాయక్ కలిసి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతానని, త్వరలోనే జిల్లా, మండల కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

డివైడర్‌ను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి పట్టణంలో జీవీఎస్ కాలేజీ ఎదుట కూల్చిన డివైడర్

కామారెడ్డి, అక్టోబర్ 27: పట్టణంలోని జీవీఎస్ కళాశాల ఎదుట ఉన్న రోడ్డు డివైడర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కూల్చి వేశారు. ఈ విషయమై విచారణ చేపట్టి, నిందితులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డితోపాటు ఎస్పీ సింధుశర్మకు పలువురు ప్రజలు ఫిర్యాదు చేశారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషిచేయాలి

ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న ఆత్మకూర్ గ్రామస్తులు

నాగిరెడ్డిపేట, అక్టోబర్27: ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజితను ఆత్మకూర్ గ్రామస్తులు ఆదివారం ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి మిఠాయిలను తినిపించారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, నాయకులు సుభాన్‌రెడ్డి, వసంత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, గ్రామస్తులు సుదర్శన్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర విద్యా మహాసభలను జయప్రదం చేయాలి

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటి

కామారెడ్డి, అక్టోబర్ 27 : ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని కామారెడ్డిలోని కర్షక్ బీఎడ్ కాలేజీలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగలి వెంకటి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్ 1,2వ తేదీల్లో కామారెడ్డిలోని లక్ష్మీదేవి గార్డెన్‌లో మూడో రాష్ట్ర విద్యా మహాసభలు నిర్వహించనున్నట్లు తీర్మానించినట్లు తెలిపారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చవాన్ సుభాన్ సింగ్ ,చంద్ర శేఖర్, దుర్గయ్య, రమేశ్, శ్యాంబ్యా నాయక్, గణపతి, మల్లికార్జున్, పోచన్న, దేవరాజు, అజయ్ కుమార్, ప్రవీణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం పొందిన లైబ్రేరియన్, ఉపాధ్యాయులు

లైబ్రేరియన్‌కు సన్మానం

బాన్సువాడ టౌన్, అక్టోబర్ 27: బాన్సువాడ లైబ్రేరియన్ సుధాకర్‌ను ఆదివారం పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. డీఎస్సీ-2024లో తాము ఉద్యోగాలు పొందేందుకు సుధాకర్ సహకరించారని వారు ఈ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. అనంతరం లైబ్రరీలో చదువుకొని ఉద్యోగాలు పొందిన వారిని గ్రంథాలయ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగాలు పొందిన కాజా శ్రీనివాస్, మహేందర్, సంతోష్, సమీరా, అనిత, సాగరిక, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బాన్సువాడ రూరల్, అక్టోబర్ 27: డాక్టర్ బీఆర్ఎస్ అంబేద్కర్ ఓపెన్ యునివర్సిటీ డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరడానికి ఈనెల 30వ తేదీ వరకు గడువు ఉన్నదని ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల స్వామి, కో-ఆర్డినేటర్ శంకర్‌రావు ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్‌లో ఉత్తీర్ణులైన వారు నేరుగా అడ్మిషన్ పొందవచ్చని పేర్కొన్నారు. సంబంధిత సర్టిఫికెట్లతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, ఆన్‌లైన్ రసీదును అధ్యయన కేంద్రంలో అందజేయాలని సూచించారు. వెరిఫికేషన్ అనంతరం ఆన్‌లైన్‌లో అడ్మిషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు.

రేపు నిజామాబాద్‌కు బీసీ కమిషన్ బృందం రాక

కామారెడ్డి, అక్టోబర్ 27: రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో అభిప్రాయాలను తెలుసుకునేందుకు తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం ఈనెల 29న నిజామాబాద్‌కు వస్తున్నదని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు సంబంధించి నిజామాబాద్‌లోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్లతో కూడిన బృందం ప్రజాభిప్రాయాలను సేకరిస్తారని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు.

ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బీబీపేట్, అక్టోబర్ 27: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాల సంఖ్య పెరుగుతున్నదని పేర్కొన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి డెబిట్, క్రెడిట్ కార్డులను అప్‌డేట్ చేయాలని, బహుమతి వచ్చిందని, ప్రాసెసింగ్ ఫీజు కోసం డబ్బులు పంపాలని అడుగుతున్నారని తెలిపారు. వారి మాటలు నమ్మొద్దని సూచించారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి లోన్లు మంజూరయ్యాయని, వివిధ రకాల యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలని చెబుతారని తెలిపారు. వాటిని ఇన్‌స్టాల్ చేసి వివరాలను నమోదు చేస్తే మీ బ్యాంకు ఖాతాలోని డబ్బులు సైబర్ నేరాగాళ్ల బ్యాంకు ఖాతాలోకి వెళ్తాయని పేర్కొన్నారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌తో అప్రమత్తంగాఉండాలని ఎస్సై సూచించారు.

కామారెడ్డికి తరలిన అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు

కామారెడ్డికి తరలివెళ్తున్న అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 27: ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా సంఘం నియోజకవర్గ ఇన్‌చారి బిట్ల సురేందర్ మాట్లాడుతూ.. కామారెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్యాడర్ శిక్షణా తరగతులకు వెళ్తున్నట్లు చెప్పారు. కామారెడ్డికి తరలి వెళ్లిన వారిలో ఎల్లారెడ్డి అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు సాయిబాబు, అమృత్, ఎల్లుబాబు, సాయిలు, డాక్టర్ దత్తు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

భూలక్ష్మమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

అతిథులను సన్మానించిన గూడెంగల్లీ వాసులు

బాన్సువాడ, అక్టోబర్ 27: పాత బాన్సువాడలోని గూడెంగల్లీలో ఉన్న భూలక్ష్మి ఆలయంలో ఆదివారం అమ్మవారి పండుగను కాలనీవాసులు ఘనంగా నిర్వహించారు. పూజల్లో రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు వారికి శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో బల్లియా చైర్మన్ గంగాధర్, సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు అంజిరెడ్డి, రవీందర్‌గుప్తా, లింగమేశ్వర్, మహేశ్, జలపతిరెడ్డి, కనుకుట్ల రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యోగా భవన్ ప్రథమ వార్షికోత్సవం

సమావేశంలో మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, అక్టోబర్ 27: కామారెడ్డిలోని యోగా భవన్ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు ఉచితంగా యోగా నేర్పించడం తోపాటు ఇలాంటి వార్షికోత్సవాలు జరుపుకోవడం ఒక మంచి సంప్రదాయం అన్నారు. యోగా విద్య అనేది మన పూర్వీకులు అందించిన అమూల్యమైన వరం అన్నారు. యోగా విద్యను కామారెడ్డిలోని అన్ని వార్డులకు విస్తరింపజేయాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి, మాజీ ఎంపీపీ సురేశ్, యోగా గురువు రాంరెడ్డి, వెరిపల్లి అంజయ్య, విశ్వనాథం, తోట సతీశ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాల అందజేత

మండలంలోని బస్వాపూర్ గ్రామ క్రికెట్ క్రీడాకారుల కోసం ప్రముఖ పారిశ్రామికవేత్త పందిరి రాజిరెడ్డి రూ.35 వేల విలువైన క్రికెట్ క్రీడా పరికరాలను అదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులకు భవిష్యత్తులో మరింత సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు.

- భిక్కనూరు, అక్టోబర్ 27

బీసీలపై అక్రమ అట్రాసిటీ కేసులు బనాయించొద్దు

మాట్లడుతున్న బీసీ లెక్చరర్స్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కాముని సుదర్శన్ నేత

కామారెడ్డి, అక్టోబర్ 27: కామారెడ్డిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ బడుగు బలహీన వర్గాల సామాజిక అవగాహన శిక్షణ సదస్సును ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా బీసీ లెక్చరర్స్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కాముని సుదర్శన్ నేత హాజరై మాట్లాడారు. బీసీలపై అన్యాయం, అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేస్తున్నారని అన్నారు. వాటిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అక్రమ కేసులను బనాయించవద్దని కోరారు. కార్యక్రమంలో బీసీ లెక్చరర్స్ జేఏసీ కో-కన్వీనర్ విఠల్, అంబేద్కర్ సంఘం నాయకులు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, వివిధ వర్గాల ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రాజంపేట్, అక్టోబర్ 27: మండలంలోని బస్వన్నపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం అదే పాఠశాలలో నిర్వహించారు. పలు వ్యాపారాలు, ఉద్యోగాలు చేస్తూ ఎక్కడెక్కడో స్థిరపడిన వారందరూ ఒకేచోట కలుసుకున్నారు. ఆత్మీయ పలుకరించుకుంటూ.. ఒకరికొకరు ఆనాటి విషయాలను నెమరు వేసుకున్నారు. కేక్ కట్ చేసి సంబురంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు శ్రీనివాస్, మురళి, రాజయ్య, వినాయక్, అరుంధతి, శ్రీవాణిని సన్మానించారు. సమావేశంలో పూర్వ విద్యార్థులు ఎం.సవిత, శ్వేత, డి.స్వప్న, పి.సవిత, ఎస్.స్వప్న, ప్రశాంతి, ఈ.సవిత, సుజాత, శంకర్, భగత్, భాస్కర్, నాగరాజు, నరేశ్, రవి, రంజిత్ మధు తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న 2003-04ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

నస్రుల్లాబాద్, అక్టోబర్ 27: మండలంలోని దుర్కి గ్రామానికి చెందిన మావురం గంగారాం (37) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడని ఏఎస్సై వెంకట్రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గంగారాం మద్యానికి బానిసై, కొంత కాలంగా ఏం పనిచేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. భార్య జ్యోతి ఆరు నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. జీవితంపై విరక్తి చెందిన అతడు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

గ్రామాల్లో ప్రచారం నిర్వహించాలి

బిచ్కుంద, అక్టోబర్ 27: బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం ఈనెల 29వ తేదీన నిజామాబాద్‌కు వస్తున్న విషయమై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు దండోరా వేయించాలని సూచించారు. ఆయా కుల సంఘాల వారు తమ కులానికి సంబంధించిన అభ్యంతరాలు, అర్జీలు ఏమైనా ఉంటే కమిషన్‌కు తెలియజేసేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రమాదంలో గాయపడ్డ మహిళ

లింగంపేట, అక్టోబర్ 27: మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మామిడి చిన్నమ్మ, మామిడి సాయిలుకు గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన వీరు ధాన్యం ఆరబెట్టడానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సమయంలో వాహనం ఢీ కొనడంతో ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో చిన్నమ్మ తలకు తీవ్ర గాయాలయ్యాయని, ఆమెను చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించినట్లు తెలిపారు. సాయిలు కాలు విరిగిందన్నారు.

కారు బైక్ ఢీకొని ఒకరికి..

నస్రుల్లాబాద్, అక్టోబర్ 27: బీర్కూర్ మండలంలోని దామరంచ గ్రామంలో ఆదివారం కారు, బైకు ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీర్కూర్‌కు చెందిన అక్తర్ బాన్సువాడకు పని నిమిత్తం బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా.. బాన్సువాడ నుంచి వస్తున్న కారు వెనుక నుంచి ఢీకొన్నది. ఈ ప్రమాదంలో అక్తర్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం బాన్సువాడ దవాఖానకు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

నేడు భిక్కనూరు బంద్

భిక్కనూరు, అక్టోబర్ 27: హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ సోమవారం భిక్కనూరు బంద్‌కు పిలుపునిస్తున్నట్లు హిందూ ఐక్య వేదిక ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాణిజ్య, వ్యాపార విద్యా సంస్థలను స్వచ్ఛందంగా మూసివేసి బంద్‌కు సహకరించాలని కోరారు. హిందూ దేవాలయాలపై దాడిచేస్తున్న వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు.

ప్రమాదకరంగా ధాన్యం కుప్పలు

పర్మళ్ల గ్రామ శివారులో రహదారిపై ఏర్పాటు చేసిన ధాన్యం కుప్పలు

లింగంపేట, అక్టోబర్ 27: రైతులు పండించిన ధాన్యం రహదారులపై ఆరబెట్టడం ప్రమాదకరంగా మారింది. మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు వానకాలంలో సాగు చేసిన వరి చేతికి వచ్చింది. ధాన్యం ఆరబెట్టడానికి సరైన సౌకర్యాలు లేకపోవడంతో రోడ్లపై ఆరబెడుతున్నారు. దీంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహనదారులు వాపోతున్నారు. పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా.. ఇంకా తూకం వేయడం లేదు. మరోవైపు వర్షాలు కురుస్తుండడంతో పంటను ఆరబెట్టడం రైతులకు ఇబ్బందిగా మారింది. వారం రోజుల క్రితం ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రమాదం జరిగింది. ఇందులో ఇద్దరికి గాయాలయ్యాయి. వెంటనే తూకం ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

నస్రుల్లాబాద్, అక్టోబర్ 27: మండలంలోని దుర్కి గ్రామానికి చెందిన మావురం గంగారాం (37) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడని ఏఎస్సై వెంకట్రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గంగారాం మద్యానికి బానిసై, కొంత కాలంగా ఏం పనిచేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. భార్య జ్యోతి ఆరు నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. జీవితంపై విరక్తి చెందిన అతడు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

బాన్సువాడ, అక్టోబర్ 27: మండలంలోని హన్మాజిపేట్ శివారులోని పెద్ద చెరువు సమీపంలో పేకాడుతున్న ఏడుగురిని పోలీసులు పట్టుకున్నారు. పక్కా సమాచారం మేరకు ప్రత్యేక బృందం దాడిచేసినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో అశోక్ తెలిపారు. ఏడుగురు పట్టుబడగా.. ముగ్గురు పారిపోయారని తెలిపారు. వారి నుంచి రూ.42వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. పేకాడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌హెచ్‌వో హెచ్చరించారు.

కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ బదిలీ

కామారెడ్డి, అక్టోబర్ 27: కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ సుజాతను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఆమె కొత్తగూడెం జిల్లా పాల్వంచ మున్సిపాలిటీకి బదిలీ అయ్యింది. కామారెడ్డి బల్దియా కమిషనర్‌గా ఆమె ఫిబ్రవరి 15వ తేదీన బాధ్యతలను చేపట్టారు. ఏడాది కాకుండానే బదిలీ కావడంపై రాజకీయ ఒత్తిళ్లు ఉండవచ్చని ప్రచారం జరుగుతున్నది. కాగా.. కామారెడ్డికి కొత్త కమిషనర్‌గా ప్రభుత్వం ఇంకా ఎవరినీ నియమించలేదు.

చుక్కాపూర్‌లో భక్తుల సందడి

దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

మాచారెడ్డి, అక్టోబర్ 27 : మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో కొలువైన శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా నలుమూలలతోపాటు ఇతర జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ఒడిబియ్యం, పట్టనామాలు, కోరెమీసాలు, కండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నూతన వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ సమీపంలో బావి నీటితో పుణ్య స్నానాలు ఆచరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
WANTED
★ ఉత్తర తిరుపతిక్షేత్రం గంగాస్థాన్-II నిజామాబాద్ కళ్యాణ మండపంలో 1) మేనేజర్‌గా Male అర్హత: డిగ్రీ, సాలరీ 15,000/-Month మరియు 2) ఎలక్ట్రిషన్ కంప్లంబర్ (అర్హత: డిప్లమా ఎలక్ట్రిషన్, సాలరీ 14,000/-Month ఆసక్తిగలవారు. ఆధార్, ఫోటో, స్టడీ సర్టిఫికేట్స్‌తో క్రింది అడ్రసుకి సంప్రదించండి. అనఘా షాపింగ్‌మాల్, ఆర్.పి.రోడ్, నిజామాబాద్.
NTZ-334492
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.